క్లుప్తంగా

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): పేదలకు వరం.. సీఎఆర్ ఎఫ్ అని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. అందోల్ మండలంలోని మాసన్‌పల్లి గ్రామానికి చెందిన బాలమణికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అందజేశారు. అదేవిధంగా రాయికోడ్ మండలం మాటూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మొల్ల ఖదీర్‌కు రూ. 4,40,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తాం

నారాయణఖేడ్: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంగ్టి నుంచి పలువురు మాట్లాడుతూ ఖేడ్ నుంచి కంగ్టి మీదుగా పిట్లం, కర్ణాటకలోని ఔరాద్‌కు బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు కంగ్టి నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని కోరారు. పొరుగు రాష్ట్రమైన ఔరాద్ డిపో నుంచి కంగ్టి మీదుగా పిట్లం, నిజాంసాగర్‌లకు బస్సులు నడుపుతున్నా ఖేడ్ డిపోనుంచి ఎందుకు నడపడం లేదని వాపోయారు. ఉదయం 8గంటలకు ఖేడ్ నుంచి దుద్‌గొండ, బోరంచ, సిందోల్ మీదుగా పటాన్‌చెరుకు బస్సును పునరుద్ధరించాలని ఆయా గ్రామాల నుంచి పలువురు ప్రయాణికులు కోరారు. ఆయా సమస్యలు నమోదు చేసుకున్న డీఎం త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

మరమ్మతులు చేపట్టండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత అన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కౌన్సిలర్‌లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ మాట్లాడుతూ వర్షాలు కారణంగా రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని, కౌన్సిలర్లతో చర్చించకుండా దళితబంధు జాబితా ఎలా తయారు చేశారని ప్రశ్నించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గూడెం విష్ణువర్ధన్‌రెడ్డికి నివాళులర్పించారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పెంచాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్ల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహరావు సూచించారు. శుక్రవారం కల్హేర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలతో దెబ్బతిన్న ఇళ్లను, చెరువులు, కుంటలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంగ్రామ్, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

జిన్నారం(పటాన్‌చెరు): పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ కావటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినోద్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

హత్నూర (సంగారెడ్డి): ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న అన్నారు. శుక్రవారం హత్నూరలోని చెరువు, కుంటలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిథిలావస్థకు ఇళ్లల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు నర్సింహులు తహసీల్దార్ పద్మావతి ఎంపీడీవో శారద సర్పంచ్ వీరస్వామిగౌడ్, గ్రామకార్యదర్శి మహేష్, వార్డుసభ్యులు తదితరులు ఉన్నారు. అనంతరం దౌల్తాబాద్‌లో కూలిపోయిన ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట ఎంపీపీ నర్సింహులు, సర్పంచ్ వెంకటేశం, కార్యదర్శి బాలరాజ్ తదితరులు ఉన్నారు.



చాకిచెరువు వద్ద అధికారులు

పండ్ల తోటలకు రాయితీ

ప్రస్తుత వాతావరణ మార్పులు. పరిస్థితులు, ఆరోగ్య సంరక్షణ, రోగ నిరోధకశక్తి పెరగాలంటే మనం తినే ఆహారంలో పండ్లు తప్పనిసరి. దీంతో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు తగిన ప్రోత్సాహకాలను అందించేందుకు ముందుకు వచ్చింది. పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు వారికి తగిన లాభాలు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల సాగు చేపట్టేలా సమాయత్తమవుతున్నారు.

– జిన్నారం (పటాన్‌చెరు)

- రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల 31
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



గుమ్మడిదల శివారులోని మామిడి తోట

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు రాష్ట్ర ఉద్యానవన శాఖ సంయుక్తంగా పండ్ల తోటల పెంపకానికి రాయితీ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 2,360 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచేవిధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. మొక్కలు నాటిన నుంచి నాలుగేళ్ల వరకు రాయితీ, ప్రోత్సాహకాలు ఇస్తారు. రాయితీని రైతు ఖాతాలో నగదు రూపంలో జమ చేస్తారు. అయితే.. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, ఐదెకరాల లోపు పట్టా భూమి, విద్యుత్ సౌకర్యం ఉన్నవారు, ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. దరఖాస్తు చేసుకునేందుకు పట్టాదారు పాసుబుక్, బ్యాంకు ఖాతా వివరాల జిరాక్స్ కాపీ, ఆధార్, పాన్ కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు తప్పనిసరి. మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మానం కాపీ సెట్‌ను ఎంపీడీఓ కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యానవన అధికారులు, ఏపీఓ(ఈజీఎస్) ఎవరికైనా ఇవ్వొచ్చు. కాగా, మామిడి, జామ, దానిమ్మ, నిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, సపోట, ఆయిల్ పామ్, బత్తాయి, అల్లనేరేడు పండ్ల తోటలకు ప్రాధాన్యం ఇస్తారు. పండ్ల తోటను పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తారు. మొక్క కొనుగోలు, నాటేందుకు గుంతలు తీయటం, మొక్కలు నాటడం, మొక్కకు ఊత కర్ర కట్టడం, ఎరువు వేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఇందుకయ్యే ఖర్చు ప్రతీనెల వంద శాతం చెల్లిస్తారు. వివరాలకు ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ అధికారులను లేదా 79977 25270 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి



రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సందేహాలున్నా రైతులు అధికారులను సంప్రదించాలి.

– శైలజ, ఉద్యానవనశాఖ అధికారి

కాలేయ రక్షణపై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం శివారులోని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యుడు పవన్‌కుమార్ గడ్డపోతారం, ఖాజీపల్లి, మంబాపూర్ పారిశ్రామిక వాడల్లోని పలు పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలేయ రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఆయా పరిశ్రమల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్‌లో కాలేయ వైద్యశిబిరం

పటాన్‌చెరు: పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ బీవీఎస్ కుమార్, కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ పవన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని పాశమైలారం ప్రాంతంలోని ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్ ప్రాంగణంలో ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యపానం తదితర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి ఎమర్జెన్సీ వైద్యుడు డాక్టర్ అప్పిరెడ్డి, ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై వరినాట్లు వేస్తూ నిరసన



వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ మండల పరిధిలోని సైదాపూర్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బహుజన సేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డప్పు రాజు అన్నారు. ఆధ్వర్యంలో సైదాపూర్–వికారాబాద్ రోడ్డుపై గ్రామస్తులతో కలిసి శుక్రవారం వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం సంగారెడ్డి, వికారాబాద్ జిల్లా వాసులు, వాహనదారులు సదాశివపేట, వికారాబాద్ ప్రాంతాలకు ఈ రోడ్డుపైనే వెళ్లాల్సి ఉంటుందన్నారు. కానీ.. రోడ్డు పూర్తిగా గుంతలు పడి బురదమయంగా మారడంతో వాహనాలు వెళ్లే పరిస్థితి లేదని వాపోయారు. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు గుంతలు పడి కంకర తేలినా ప్రభుత్వం పట్టించుకోకవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతసాగర్ మాజీ ఎంపీటీసీ ప్రకాశం, నాయకులు కరుణాకర్‌గౌడ్, శ్రీనివాస్, దర్శన్‌యాదవ్, మైపాల్ అంజయ్య పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మాణిక్‌రావు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

జహీరాబాద్ టౌన్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలు, రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో వసంత్ విహారం, చెన్నారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మించిన మార్కెట్‌ను, నారింజ ప్రాజెక్టును సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఆత్మకమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, తహసీల్దార్ స్వామి, సీఐ రాజు వివిధ శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మొహియొద్దీన్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల పంపిణీ

క్యాంప్ కార్యాలయంలో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను ఎమ్మెల్యే మాణిక్‌రావు పంపిణీ చేశారు. లైసెన్స్ కోసం ఇటీవల దరఖాస్తులు తీసుకొని ప్రతి రోజు 100 చొప్పున లైసెన్స్‌లు అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధికి సమష్టిగా సహకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ అభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్లు సమష్టిగా సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ అన్నారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. 2వార్డు కౌన్సిలర్ పరంజ్యోతి మాట్లాడుతూ తన సొంత స్థలంలో సీసీ రోడ్డు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించగా, స్థల పత్రాలు చూపించాలని 3వ వార్డు కౌన్సిలర్ చౌదరిప్రకాష్ తెలుపగా, వార్డు ప్రజల కోరిక మేరకే రోడ్డు వేసినట్లు కమిషనర్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే, హ్యాండ్‌లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ కృషితో పట్టణాభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరయ్యాయని, తొలివిడతలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.25 కోట్ల పనులు చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ, వైస్‌చైర్మన్ చింతా గోపాల్ తెలిపారు. మలివిడత నిధులతో పనులు పూర్తిచేస్తామన్నారు. కోటి 50 లక్షలతో పట్టణంలోని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. పట్టణంలో కుక్కల బేడదను తొలగించాలని కౌన్సిలర్లు వడ్ల మహేశ్వరీ, రాజేశ్వరీ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అపర్ణ పాటిల్, పులి మామిడిరాజు, చౌదరి ప్రకాష్, విద్యాసాగర్‌రెడ్డి, ఇంద్రమోహన్‌గౌడ్, శ్రీనివాస్, నాగరాజ్ గౌడ్, ఇలియాస్ షరీఫ్, ఇంజనీర్ రాజేష్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం మటన్ మార్కెట్ స్థలంలో తాత్కాలికంగా వ్యాపారం చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని నిర్వాహకులు చైర్‌పర్సన్ జయమ్మ, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మణిపూర్ ఘటన హేయమైన చర్య

నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల డిమాండ్

సదాశివపేట(సంగారెడ్డి): మణిపూర్ ఘటన హేయమైన చర్య అని, మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్‌ను వెంటనే భర్తరఫ్ చేసి శాంతి నెలకొల్పాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మణిపూర్ సీఎం, కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మణిపూర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ యాత్రలకే ప్రాధాన్యం ఇస్తున్నారే తప్ప చర్యలు చేపట్టలేదని విమర్శించారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు మల్లేశం, మహేష్, భూషణం, అనంద్ పాల్గొన్నారు.

మైనార్టీల రాస్తారోకో

వట్‌పల్లి(అందోల్): మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ జోగిపేటలో మైనార్టీలు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అల్లర్లను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. మణిపూర్‌లో తక్షణమే అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ ఎండీ ఫైజల్, మైనార్టీ నాయకులు అర్షత్, ఆలీషా, మహబూబ్, అత్తర్, చోటు, వాజిద్ పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

పటాన్‌చెరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అమీన్‌పూర్ పట్టణ పౌరులకు అందుబాటులో ఉంటానని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పట్టణంలోని వివిధ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లలో నీరు నిల్వకాకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు 1) శ్రీ సథాజీ తండ్రి అనంత్ రావు వయసు: 44 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, R/o H.No 3-1-32, గడిమొహల్లా, జహీరాబాద్ టౌన్, సంగారెడ్డి జిల్లా మరియు 2) శ్రీ బోయిన సాయి కుమార్ తండ్రి బోయిన వర్షతాలు వయసు: 32 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, 5-24 -1031, PP నగర్, గాజులరామారం గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వారు బుచ్చినెల్లి గ్రామం, జహీరాబాద్ మండలం, సంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నం.131/ఈఈ1 లోని 3781-25 చ.గజాల విస్తీర్ణం గల ఏరియా మరియు సర్వే నం. 131/ఈఈ2 లోని 3781-25 చ.గజాల విస్తీర్ణం గల ఏరియా మొత్తం 7562-5 చ.గజాల విస్తీర్ణం గల ఏరియా సరిహద్దులు: ఉత్తరం: N.H.No.65, దక్షిణం: M.G. ఆలోహెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, తూర్పు: ఉన్నటి మార్గం 30 వెడల్పు రోడ్డు, పశ్చిమం: సర్వే నం. 132 భూమి హద్దులుగా ఉన్న ఖాళీ వ్యవసాయేతర భూమిని 1) శ్రీ పరిహార్ సోహన్ లాల్ చౌదరి తండ్రి సేనా రామ్ చౌదరి వయసు 33 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం R/o H.No.10-5-814/7/5/A, తుకా రామ్ గేట్, సికింద్రాబాద్, లాలాగూడ, హైదరాబాద్, TS 2) శ్రీ రాజారామ్ ప్రజాపత్ తండ్రి సోహన్‌లాల్ ప్రజాపత్, వయసు 35 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, R/o ఉంజీ గార్డెన్, పుప్పాలగూడ, రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం వారికి చెందిన స్వయం ఆర్జిత ఆస్తిని విలువైన అమ్మకపు ప్రతిఫలం కొరకు కొనుగోలు చేయుటకు వారు అమ్మకపు ఒప్పందం కుదుర్చుకున్నారు. నా క్లయింట్ అడ్వాన్స్ అమ్మకపు ప్రతిఫలం నిమిత్తం తగిన మొత్తం కూడా చెల్లించారు & తగిన అగ్రిమెంట్ మరియు లేఖ కూడా పొంది ఉన్నారు.

పైన తెలిపిన బుచ్చినెల్లి గ్రామం, జహీరాబాద్ మండలం, సంగారెడ్డి జిల్లా వద్ద గల సర్వే నం. 131/ఈఈ1 లోని 3781-25 చ.గజాల విస్తీర్ణం మరియు సర్వే నం. 131/ఈఈ2 లోని 3781-25 చ.గజాల విస్తీర్ణం గల ఏరియా మొత్తం 7562-5చ.గజాల విస్తీర్ణం గల ఏరియా ఖాళీ వ్యవసాయేతర భూమికి సంబంధించి ఏ వ్యక్తి లేదా వ్యక్తులు లేదా పార్టీకైనా ఏదైనా అభ్యంతరం, హక్కు, టైటిల్ లేదా ప్రయోజనం లేదా ఏ రకమైన క్లెయిమ్ అయినా కలిగి ఉంటే, ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 7 రోజులలోగా వారి క్లెయిమ్/ ప్రయోజన సంబంధమును ఆధారంగా సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారుని సంప్రదించవచ్చును. లేనియెడల నా క్లయింట్ రిజిస్టర్ అమ్మకపు వ్యవహారాలతో ముందుకు కొనసాగుతారు మరియు తదుపరి ఎటువంటి క్లెయిమ్‌లు లేదా ఏ రకమైన అభ్యంతరాలు స్వీకరించబడవు.

విలాస్ శాస్త్రి, అడ్వకేట్, జహీరాబాద్,
తేది: 24.07.2023, సెల్ నం. 9849613240
ప్రదేశం : జహీరాబాద్

ఎంపీ సోయం బాపురావు దిష్టిబొమ్మ దహనం

జహీరాబాద్ టౌన్: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కేంద్రానికి ఎంపీ లేఖ రాయడాన్ని నిరసిస్తూ గిరిజనులు శుక్రవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని బంజార భవనం ఎదుట ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో లంబాడీ జేఏసీ నాయకులు శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ సోయం బాపురావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

సంక్షిప్త వార్తలు

◆ సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

నారాయణఖేడ్: మండల పరిధిలోని అల్లాపూర్ పంచాయతీ పరిధిలోని మల్సరేగడి తండావాసులు శుక్రవారం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, సేవాలాల్ మహారాజ్, అంబేడ్కర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ తమ తండాకు తారురోడ్డు కోసం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రూ.2.09కోట్లు మంజూరు చేయించారని, తాము బీఆర్‌ఎస్ వెంటే ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, అల్లాపూర్ సర్పంచ్ ఏక్‌నాథ్‌రావు పాల్గొన్నారు.

◆ అమీన్‌పూర్ పీఎస్‌కు ఇద్దరు ఎస్‌ఐలు

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐలు ఈవీ రమణ, మల్లయ్య అమీన్‌పూర్ ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ సుభాష్ ఇటీవలే హత్నూరకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మయూరినగర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

◆ మత సామరస్యానికి ప్రతీక మొహరం



పటాన్‌చెరు టౌన్: మత సామరస్యానికి ప్రతీక మొహరం పండగ అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలం పరిధిలోని నందిగామ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మొహరం పండగలో పాల్గొని ప్రార్థనలు చేశారు. హుస్సేన్, పాష, జహంగీర్, మహబూబ్, బాబు, మేరా, రాములు, జంగయ్య, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

◆ పంటలను కాపాడుకోవాలి

కోహీర్(జహీరాబాద్): వర్షాలతో నీట మునిగిన పంట పొలాలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ శ్రీనివాస్, స్థానిక నాయకులు ఉన్నారు.

◆ కోహీర్ ఏఈగా మనీష్

కోహీర్(జహీరాబాద్): కోహీర్ సెక్షన్ విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌గా మనీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కోహీర్‌లో ఇప్పటివరకు విధులు నిర్వహించిన అబ్దుల్లా హబీబ్ సొంత జిల్లా నల్గొండకు బదిలీపై వెళ్లారు. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బంది అబ్దుల్లా హబీబ్‌కు ఘనంగా వీడ్కోలు పలికి మనీష్‌కు స్వాగతం పలికారు.

◆ రైతులు అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి టౌన్ : పంట పొలాల వద్ద రైతులు విద్యుత్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రాజేష్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ మోటార్లను ఆన్ చేయకూడదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏదైనా సమస్య ఉంటే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

◆ ఎస్‌ఐకి సన్మానం

కల్హేర్(నారాయణఖేడ్): ఇటీవల ఎస్‌ఐగా బదిలీపై వచ్చిన వెంకటేశంను ఆత్మ చైర్మన్ రాంసింగ్, జెడ్పీటీసీ నర్సింహరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గుర్రపు జలందర్ మర్యదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అలీ, వైస్‌ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు కిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్, నాయకులు అంజయ్య, నారాయణరావు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్‌లో చేరిక

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని మాటూర్ గ్రామానికి చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాటూర్ సర్పంచ్ ప్రవీణ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

సంగారెడ్డి టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని కలబ్‌గూర్ గ్రామంలోని వర్షాలతో నష్టపోయిన పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకి ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సత్యానందం పాల్గొన్నారు.

◆ రామమందిరం నిర్మాణ పనులకు భూమిపూజ

నారాయణఖేడ్: పట్టణంలోని చారిత్రాత్మక రామాలయం గర్భాలయ నిర్మాణ పనులను మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ శుక్రవారం ప్రారంభించారు. రామాలయం జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా ఇప్పటికే ప్రహరీ నిర్మాణం పనులు పూర్తి కాగా దాతలుగా వ్యవహరిస్తున్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, ఆయన సోదరుడు నగేష్ షెట్కార్, కుటుంబ సభ్యుల ద్వారా కల్యాణ మండప నిర్మాణం పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వివేకానంద్, పాండు, జగదీశ్, నర్సింహులు, మారుతి, బస్వరాజ్, గంగయ్యస్వామి, పూజారి పాల్గొన్నారు.

◆ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షం నీటిని ఆసరా చేసుకొని కాలుష్య జలాలను బయటకు వదులుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. జిన్నారం గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు శుక్రవారం బొంతపల్లి పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత జలాలతో రాయినిచెరువు కలుషితంగా మారుతోందన్నారు. దీంతో ప్రభుత్వం స్పందించి పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, మంద రమేష్, లింగం, బ్రహ్మేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ రక్తదానం మహాదానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: రక్తదానం మహదానం మహాదానమని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతిస్వామి అన్నారు. అందోల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఓ మహిళా అనారోగ్యంతో సంగారెడ్డి ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతోంది. రోగిని పరీక్షించిన వైద్యులు రక్తం తక్కువ ఉంది.. రక్తం ఇవ్వాలన్నారు. దీంతో విషయం తెలుసుకున్న భిక్షపతిస్వామి వెంటనే స్పందించి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ అభినందించి ప్రశంసపత్రం అందజేశారు.